పీఎంఆర్ లా కళాశాలలో అడ్మిషన్లు

మన్సూరాబాద్, మే 1: ఎల్బీనగర్, చింతలకుంట లోని పొనుగోటి మాధవరావు లా కళాశాలలో బీఏ ఎల్ఎల్బీ లో అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025- 26 విద్యా సంవత్సరం లో ఐదు సంవత్సరాల బీఏ ఎల్ఎల్బీ కోర్స్ కోసం పీఎంఆర్ లా కళాశాలకు అనుమతులు వచ్చాయని అన్నారు. లా సెట్ 2025 కన్వీనర్ కోటా ద్వారా అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. పీఎంఆర్ లా కళాశాలలో మూడు సంవత్సరాల ఎల్ఎల్బీ, ఎల్ఎల్ఎం కోర్సులు కూడా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శిల్పారామం లో సమ్మర్ ఆర్ట్ క్యాంప్

కొండాపూర్, మే 1 : వేసవి సెలవుల సందర్భంగా మాదాపూర్ లోని శిల్పారామంలో సమ్మర్ ఆర్ట్ క్యాంపును శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ట్ క్యాంప్ లో పెన్సిల్ స్కెచ్, పాటరీ, మధుబని పెయింటింగ్, ట్రైబల్ పెయింటింగ్, అక్రిలిక్ పెయింటింగ్, మండల పెయింటింగ్, సీషెల్ క్రాఫ్ట్, భగవత్ గీత శ్లోకాలలో అన్ని వయసుల వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

పొగాకును నిషేధించాలి

ఖైరతాబాద్, మే 1 : గంజాయి మాదిరిగానే పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించాలని డాక్టర్ ఓఎన్ రావు చారిటబుల్ ట్రస్ట్ డాక్టర్ రావూస్ ఓరల్ హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ నాగేశ్వర్ రావు కోరారు. వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో గాంధీ దవాఖా పరిపాలన విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ కేటి రెడ్డితో కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో గచ్చిబౌలి ఓమేగా హాస్పిటల్ సీనియర్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ విద్యా వాసిని, విశ్రాంత సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చిట్టిబాబు, సినీ సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు ఫెలోషిప్

కొండాపూర్, మే 1 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ది స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ వైథీశ్వరన్ ప్రతిష్టాత్మక రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. వైథీశ్వరన్ ఎనర్జిటిక్ మెటీరియల్ విభాగంలో ఎలక్ట్రానిక్ స్ట్రక్చర్ ఆఫ్ సాలిడ్స్ పై చేసిన పరిశోధనలకు గాను ఫెలోషిప్ కు ఎంపికయ్యారని వర్సిటీ యాజమాన్యం పేర్కొంది.

హీరో విజయ్ దేవరకొండపై ఫిర్యాదు

వెంగళరావునగర్: గిరిజన జాతిని అవమానించేలా మాట్లాడిన సినీ హీరో విజయ్ దేవరకొండపై చర్యలు తీసుకోవాలని ట్రైబల్ లాయర్స్ అసోసియేషన్ చైర్మన్ కిషన్ రాజ్ చౌహాన్ గురువారం ఎస్ ఆర్ నగర్ పోలీస్టేషన్ ఫిర్యాదు చేశారు. 26వ తేదీన జరిగిన మాటీవి ఫిలింస్ ఫ్రి రిలీజ్ రెట్రో మూవీ ఈవెంట్లో హీరో విజయదేవరకొండ పాకిస్థాన్ తీవ్రవాదుల గురించి మాట్లాడుతూ 500 సంవత్సరాల క్రితం ట్రైబల్స్ కొట్టుకున్నట్లు బుద్ధి లేకుండా,కనీస కామన్‌సెన్స్ లేకుండా వ్యవహరిస్తున్నారంటూ తమ ప్రస్తావన తెచ్చి అవమానకరంగా మాట్లాడారని తెలిపారు. హీరో దేవరకొండపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు నమోదు చేయాలని కోరారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిటీ బ్యూరో, మే1 (నమస్తే తెలంగాణ): రామంతాపూర్, బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలోని గిరిజన సంక్షేమ శాఖ ప్రాయోజిత విద్యార్థుల హాస్టళ్ల నిర్వహణకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఆర్ కోటాజీ కోరారు. పూర్తి వివరాలకు హైదరాబాద్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, మొబైల్ నంబర్ 9440764520 సంప్రదించాలని ఆయన సూచించారు.

హృద్రోగులకు వరం.. క్యాథల్యాబ్

- కేసీఆర్ హయాంలో రూ. 7 కోట్లతో ఏర్పాటు
- మూడేండ్లలో 20 వేల మందికి పైగా గుండె పరీక్షలు, చికిత్సలు

ఉస్మానియా దవాఖాన

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ హయాంలో ప్రవేశపెట్టిన ఆరోగ్య ఫలాలు రోగులకు వరంగా మారుతున్నాయి. ఇప్పటికే ఆరోగ్యశ్రీతో లక్షల మంది నిరుపేద రోగులు వివిధ రకాల శస్త్రచికిత్సలు, అవయవమార్పిడి వంటి ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా పొందుతుండగా బీఆర్ఎస్ హయాంలో సమకూర్చిన వైద్యపరికారులు, ల్యాబ్‌లు ఆరోగ్య వసతులు సైతం రోగులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వం మారినా నాటి బీఆర్ఎస్ సర్కార్ ఆరోగ్య ఫలాలు మాత్రం రోగులకు పునర్జీవం పోస్తున్నాయి. ఈ క్రమంలోనే ఉస్మానియా దవాఖానలో ఏర్పాటు చేసిన క్యాథల్యాబ్ పేద హృద్రోగులకు వరంగా మారింది. తెలంగాణ ఆవిర్భావానికి పూర్వం ప్రభుత్వ రంగ దవాఖానల్లో గుండె పరీక్షలకు సంబంధించిన క్యాథల్యాబ్ లేకపోవడంతో రోగులకు ఆర్థిక భారం తప్పేది కాదు. అంతే కాకుండా రోగులు బయట పరీక్షలు చేయించుకుని, నివేదికలు తీసుకువచ్చే వరకు చికిత్సలో కూడా జాప్యం జరిగేది. ఇందులో భాగంగానే ఉస్మానియాకు వచ్చే రోగులు సైతం కొన్ని రకాల గుండె పరీక్షలు, ప్రొసీజర్స్ కోసం బయట ల్యాబ్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. సాధారణంగా గుండె సంబంధిత పరీక్షలుగాని, చికిత్సగాని ఖరీదైనవి కావడంతో నిరుపేద హృద్రోగులకు ఆర్థిక భారం తప్పేది కాదు. దీనిని గమనించిన నాటి కేసీఆర్ సర్కార్ 2022లో రూ.7 కోట్ల రూపాయల వ్యయం వెచ్చించి ఉస్మానియా దవాఖానలో కొత్తగా క్యాథల్యాబ్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కార్పొరేట్ తరహాలో ఏర్పాటు చేసిన ఈ క్యాథల్యాబ్ ద్వారా నిరుపేదల హృద్రోగులకు ఖరీదైన వైద్యసేవలను పైసా ఖర్చు లేకుండా పూర్తి ఉచితంగా అందిస్తున్నారు ఉస్మానియా వైద్యులు.

20వేల మందికి పైగా పరీక్షలు

సాధారణంగా గుండె సంబంధ వ్యాధులతో బాధపడే హృద్రోగులకు క్యాథల్యాబ్ ద్వారా పలు రకాల పరీక్షలు నిర్వహిస్తారు. వాటి నివేదికల ఆధారంగానే చికిత్స చేయాల్సి ఉంటుంది. గడిచిన మూడేళ్లలో దాదాపు లక్షమందికి పైగా ఓపీ సేవలు అందించగా వారిలో సుమారు 20వేల మందికి పైగా పలు రకాల గుండె పరీక్షలు జరిపి, అవసరమైన చికిత్స అందించినట్లు అధికారులు తెలిపారు.

40వేల మందికి ప్రొసీజర్స్

కార్పొరేట్‌కు దీటుగా సేవలందిస్తున్న ఉస్మానియా క్యాథల్యాబ్‌కు నిరుపేదలు క్యూ కడుతున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కర్నాటక, మహారాష్ట్రతో పాటు బిహార్, యూపీ తదితర ప్రాంతాలకు చెందిన రోగులు సైతం ఇక్కడ చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. గడిచిన ఏడాది కాలంలో సుమారు 1573 ఆంజియోగ్రామ్స్, 913 పీటీసీఏలు, 39016 2డీ-ఈకోలు చేశామని, మొత్తం 40వేల మందికి ఈ క్యాథలాబ్ ద్వారా గుండెకు సంబంధించిన పలురకాల ప్రొసీజర్స్, పరీక్షలు జరిపి చికిత్స అందించినట్లు తెలిపారు.

సేవలు బాగున్నాయి

గుండె పరీక్షల కోసం 2023లో మా అత్తను తీసుకుని ఉస్మానియాకు వచ్చినం. బాగా చేసింద్రు. అదే నమ్మకంతో ఇప్పుడు మా భర్తను తీసుకువచ్చినం. ఇక్కడికి రావడానికి ముందు ఎమర్జెన్సీ ఉందని ప్రైవేటుకు వెళితే, ఒక రోజులోనే 20వేలు ఖర్చైనయ్. వెంటనే ఉస్మానియాకు వచ్చినం. జనం ఎక్కువగా ఉండటం వల్ల ప్రతి చోట కొంత వెయిటింగ్ తప్పడం లేదు. డాక్టర్లు బాగానే చూసింద్రు. గుండె పరీక్షలు చేసింద్రు. ఆంజియోగ్రామ్ చేయాలని చెప్పింద్రు.

– హసీనా బేగం

సిటీ బస్ పాస్‌లకు రూ.20 మెట్రో కాంబీ టికెట్

సిటీ బ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బస్ పాస్ కలిగిన వారికి టీజీఆర్టీసీ మెట్రో కాంబీ టికెట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈమేరకు టీజీఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలో ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్ పాస్ కలిగి ఉన్నవారు రూ.20 కాంబీ టికెట్ తీసుకుంటే మెట్రో డీలక్స్ బస్సుల్లోనూ ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ టికెట్ ఒక ట్రిప్‌నకు వర్తిస్తుందని వెల్లడించారు. కండక్టర్ల దగ్గరే తీసుకోవచ్చని తెలిపారు. దీన్ని మెట్రో డీలక్స్ బస్సుల్లో అమలు చేయనున్నట్లు చెప్పారు.

భూదాన భూములపై విచారణ చేపట్టాలి

రవీంద్రభారతి, మే 1: భూదాన భూముల అన్యాక్రాంతంపై, అవకతవకలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అఖిల భారత సర్వసేవా సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ మహాదేవ్ విద్రోహి రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. భూదాన భూముల విషయంలో అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అఖిలభారత సర్వోదయ మండలి జాతీయ అధ్యక్షుడు వెదిరె అరవిందర్‌రెడ్డి, తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు తొలుపునూరి కృష్ణాగౌడ్, వెదిరె రామచంద్రారెడ్డి కుమారులు వెదిరె ప్రమోతీశ్ చంద్రారెడ్డి, వెదిరె ప్రభోద్ చంద్రారెడ్డి తదితరులతో కలసి మహాదేవ్ విద్రోహి మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వానికి ఫోర్జరీ పత్రాలు సమర్పించిన కారణంగా భూదాన యజ్ఞబోర్డు చైర్మన్‌గా నియమించిన గున్న రాజేందర్‌రెడ్డిని 2015లో అప్పటి ప్రభుత్వం చేసిందని, దీనిపై ఆయన హైకోర్టుకు వెళ్లగా కోర్డు కూడా బర్తరఫ్ సరైందేనని తీర్పు చెప్పిందని, గున్న రాజేందర్‌రెడ్డి హయాంలో జరిగిన భూదాన భూముల అక్రమాలకు సంబంధించిన కేసులను విచారించి ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిందన్నారు.

బాల్యం నుంచి కష్టపడితేనే భవిష్యత్

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): విద్యార్థులు బాల్యం నుంచే కష్టపడితే జీవితంలో మంచి భవిష్యత్తుకు ఆస్కారం ఉంటుందని పద్మశ్రీ అవార్డు గ్రహీత, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపిచంద్ పేర్కొన్నారు. గురువారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో ఆయన జూమ్ మీటింగ్ ద్వారా విద్యార్థులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి అలుగు వర్షిణి విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్నాలజీకి అనుగుణంగా మారాలి



యూనియన్ కార్యాలయంలో మేడే వేడుకల్లో పాల్గొన్న ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు

బంజారాహిల్స్,మే 1: మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా సినీ కార్మికులు నిరంతం తమలోని నైపుణ్యాన్ని పెంచుకుంటేనే సరైన అవకాశాలు పొందగలుగుతారని ఎఫ్‌డీసీ చైర్మన్, నిర్మాత దిల్‌రాజు అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం 2లోని తెలుగు సినీ టీవీ డిజిటల్ ప్లాట్‌ఫాం ప్రొడక్షన్, సెట్ అసిస్టెంట్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి దిల్ రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంతో పోలిస్తే సినీ రంగంలో అనేక మార్పులు వచ్చాయని, ముఖ్యంగా టెక్నాలజీ విషయంలో అనేక మార్పులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫిలింఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభవనేని అనిల్, ప్రొడక్షన్ యూనియన్ అధ్యక్షుడు బాసాటి వెంకట కృష్ణ, కార్యదర్శి రాజేంద్రప్రాద్, పుట్టా ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కులగణనను అడ్డుకున్నదే కాంగ్రెస్

సమావేశంలో మాట్లాడుతున్న నారగోని, రామకృష్ణయ్య

ఖైరతాబాద్, మే 1 : కులగణనలో దేశానికి తెలంగాణ ఆదర్శమని చెబుతున్న ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ సిగ్గుపడాల్సిన సందర్భమని వక్తలు అన్నారు. సోమాజిగూడలోని అఖిల భారత గాండ్ల తేలికుల సంఘం ట్రస్ట్ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని, బీసీ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు పాలూరు రామకృష్ణయ్యతో కలిసి మాట్లాడారు. దేశాన్ని అత్యధిక కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ బీసీల రిజర్వేషన్లను తొక్కిపెడుతూ వస్తోందన్నారు. వారు అధికారంలో ఉన్నప్పుడు ఒక్కసారి కూడా కులగణన చేయలేదని, అది కాకుండా అడ్డుపడిందన్నారు. 42 శాతం రిజర్వేషన్ల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అన్ని రంగాల్లో అది అమలు చేసే అవకాశం ఉందని, కాని కేంద్రంపై నెట్టివేస్తూ తప్పించుకునే కార్యక్రమానికి తెరలేపిందన్నారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన రేవంత్ రెడ్డి ఆ వర్గాలకు తీరని మోసం చేస్తున్నారని, ప్రతి రంగంలో తన సామాజికవర్గానికి చెందిన వారిని నియమించుకుంటూ బీసీలను అణగదొక్కుతున్నారన్నారు. ఈ సమావేశంలో బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్, బీసీ సంఘాల జేఏసీరాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేశం గౌడ్, రాష్ట్రీయ నారీ సమాజ్ అధ్యక్షురాలు పాలూరు లక్ష్మి, అఖిల భారత తేలికల సంఘం అధ్యక్షుడు శంకరయ్య, బీసీ నాయకులు చంద్రశేఖర్, నర్సయ్య, సైదాబేగం పాల్గొన్నారు.

రూ. 899 కోట్లు వసూలు

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీకి ఎర్లీబర్డ్ స్కీం రూపంలో కాసుల వర్షం కురిపించింది. ముందుస్తుగా ఆస్తిపన్ను చెల్లించి 5 శాతం రాయితీ పొందాలంటూ ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీ వరకు యాజమానులకు జీహెచ్ఎంసీ అవకాశం కల్పించింది. 30 సర్కిళ్ల పరిధిలో సీఎస్‌సీ సెంటర్లు, బిల్ కలెక్టర్లు, మీ సేవ , ఆన్‌లైన్‌ల ద్వారా చెల్లింపుల ద్వారా రూ. 1000 కోట్ల నిర్ధేశిత లక్ష్యాన్ని ఖరారు చేసుకున్నది. ఈ మేరకు జోన్ల వారీగా లక్ష్యాలను ఖరారు చేసింది. ఇందులో భాగంగానే 30 సర్కిళ్లకు గానూ దాదాపుగా 8 లక్షల మంది వినియోగదారులు ఎర్లీబర్డ్ స్కీంను సద్వినియోగం చేసుకున్నారు. దీంతో రూ. 899.93 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టుకున్నది. అత్యధికంగా శేరిలింగంపల్లి సర్కిల్‌లో రూ. 124.86 కోట్లు , అత్యల్పంగా చాంద్రాయణ గుట్ట రూ. 3.09 కోట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. చివరి రోజు బుధవారం ఒక్క రోజే 101.69 కోట్లు రాగా మొత్తం టార్గెట్‌లో రూ.100.7 కోట్ల మేర వెనుకబడింది. ఈ స్థాయి మేర వసూలు రావడం అభినందనీయమని, అధికారుల పనితీరును ఈ సందర్భంగా కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ కొనియాడారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ) : రాబోయే వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా చేపట్టిన స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులు, అసంపూర్తిగా ఉన్న నాలా అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేసేందుకు పూర్తి చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ నాగోల్ సాయి నగర్ నుంచి ఆర్టీఓ ఆఫీస్ వరకు సుమారు 350 మీటర్ల స్టార్మ్ వాటర్ బాక్స్ డ్రెయిన్ పనులు, ఉప్పల్ ఎస్ఆర్‌డీపీ నేషనల్ హైవే ఫ్లైఓవర్ పనులు, బైరామల్ గూడ ఫ్లైఓవర్ కింద బ్లాక్‌లో వివిధ క్రీడలను ప్రోత్సహించేందకు చేపట్టిన పనులు పరిశీలించారు. ఎల్బీనగర్ జోన్‌లో లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు నివారణకు చేపట్టిన స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, ఎస్ఎన్‌డీపీ ద్వారా చేపట్టిన నాలా అసంపూర్తి పనులన్నింటిని వచ్చే వర్షాకాలం లోపు పూర్తి చేసేందుకు తగిన అన్ని చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. బైరామల్ గూడ ఫ్లైఓవర్ కింద బ్లాక్‌లో క్రీడలను ప్రోత్సహించేందుకు 6 బ్లాక్‌లలో చేపట్టనున్న పనులను పరిశీలించి క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా పనులు చేపట్టాలని సూచించారు. స్టార్మ్ వాటర్ నిర్మాణం వలన ఎన్ని కాలనీలకు ప్రయోజనం కలుగుతుందని కమిషనర్ ఈఈ రమేశ్ బాబును వివరణ కోరగా సుమారు 5 కాలనీలో వరద ముంపు నివారణ అవుతుందని ఈఈ కమిషనర్‌కు వివరించారు. ఎప్పటి వరకు పూర్తి అవుతుందని కమిషనర్ ఈఈని అడుగగా నెల రోజుల్లో పూర్తి అవుతుందని వివరించారు. వచ్చే వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని కమిషనర్ ఈఈని ఆదేశించారు. అనంతరం ఉప్పల్ చౌరస్తా వద్ద ఎస్ఆర్‌డీపీ ఫ్లైఓవర్ పనులతో పాటుగా నేషనల్ హైవే నారాపల్లి సీపీఆర్ఐ వరకు చేపట్టిన పనులను కూడా ఈ సందర్భంగా కమిషనర్ పరిశీలించారు.కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, హయత్ నగర్, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్లు తిప్పర్తి యాదయ్య, ఆంజనేయులు, ఇంజినీరింగ్ మెయింటెనెన్స్ ఈఈలు కార్తీక్, రమేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులకు అన్యాయం

రవీంద్రభారతి, మే 1: తెలంగాణ పోలీస్ గృహ నిర్మాణ సంస్థలో ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. గురువారం బషీర్‌బాగ్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా రాందాస్ ఎస్సీ. ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రమోషన్లు ఇవ్వకుండా ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఆర్‌సీ కుమార్‌ను జీవోకు వ్యతిరేకంగా ఔట్‌సోర్సింగ్ విధానంతో తీసుకున్నారని వెంటనే విధుల్లో నుంచి తొలగించి పోలీస్ గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ రమేశ్‌రెడ్డి 70 ఏండ్లు దాటిన స్థానికేతరులను అక్రమంగా నియమిస్తున్నారు.



ఎస్సీ.ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరారాందాస్

కార్మికుల హక్కుల కోసం పోరాడుతా

జెండాను ఎగురవేసున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి

మల్కాజిగిరి మే 1: కార్మికుల హక్కుల కోసం పోరాడుతామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా బోయిన్ పల్లిలోని క్యాంపు కార్యాలయం బీఆర్‌టీయూ జెండా, అల్వాల్ సర్కిల్ ఐజీ చౌరస్తా వద్ద లేబర్ అడ్డాలో కార్మికుల జెండాను పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మా రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశవర్కర్లు ,అంగన్‌వాడీలు, ఆర్పీ లు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారని, కాంట్రాక్టు లేబర్స్ కి వేతనాల్లో జీఎస్టీ పేరుతో జీతాలు తగ్గిస్తున్నారని, వాటర్ వర్క్‌లలో పని చేసే కార్మికులకు సమాన పనికి వేతనాల్లో వ్యత్యాసం చూపిస్తున్నారన్నారు. మాజీ చైర్మన్ గజ్జల నగేశ్, బీఆర్‌టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభు ప్రభాకర్, రవి చారి, సురేశ్ ,సంతోష్, సిరాజుద్దీన్, అమినుద్దీన్ , రమేశ్, శివకుమార్, భాగ్యనంద సుమన్, సాయి, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు జాజుల బాలయ్య , మల్లేశ్, పరమేశ్, శరణ గిరి, అరుణ్, తేజ రావ్, పవన్, సురేశ్, ప్రశాంత్ రెడ్డి, రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఫార్మాసిటీ రైతులకు ఇండ్ల స్థలాలు

మ్యాపును పరిశీలిస్తున్న శశాంక

కందుకూరు ,మే 1: ఫార్మాసిటీ ఏర్పాటు కోసం భూములు కోల్పోయిన రైతులకు ఇండ్ల స్థలాలు కేటాయిస్తామని ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక తెలిపారు. బుధవారం టీజీఐఐసీ రెవెన్యూ అధికారులతో కలిసి గత ప్రభుత్వం ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు మీర్ ఖాన్‌పేట్ రెవెన్యూ పరిధిలో ఎకరాకు 121 గజాలు చొప్పున ఇవ్వడానికి చేసిన లేఅవుట్‌తో పాటు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాప్ ను పరిశీలించారు. ఆయన వెంట టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రావణ్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

జలమండలికి పురస్కారం

సిటీబ్యూరో, మే1,(నమస్తే తెలంగాణ): జలమండలిలో పని చేసే కార్మికులు భద్రతా ప్రమాణాలు పాటించడంలో ప్రత్యేక చొరవ తీసుంటున్న జలమండలి ఉత్తమ యాజమాన్య పురస్కారాన్ని కైవసం చేసుకుంది. మేడే సందర్భంగా రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అవార్డును జలమండలి ఎండీ అశోక్ రెడ్డికి అందజేశారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

శేరిలింగంపల్లి, మే 1: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరం గురువారం ప్రారంభమైంది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేన రెడ్డి, వైస్ చైర్మన్, సోని బాల దేవి ఆధ్వర్యంలో పలు ప్రత్యేక క్రీడా విభాగాల్లో నిర్వహిస్తున్న ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరం లో దాదాపు 800 మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. 11 క్రీడా విభాగాలు అథ్లెటిక్స్, ఫుట్ బాల్ , బ్యాడ్మింటన్, బాక్సింగ్, కరాటే, క్రికెట్, రెజ్లింగ్, స్కేటింగ్, బాస్కెట్‌బాల్, స్విమ్మింగ్ తదితర విభాగాల్లో ఈ క్రీడా శిబిరాలు నిర్వహించనున్నట్లు స్టేడియం అడ్మినిస్ట్రేటర్ మధు పేర్కొన్నారు. మే 1 నుంచి జూన్ 6వ తేదీ వరకు ఈ శిక్షణ శిబిరం కొనసాగుతుందన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వెబ్‌సైట్ లో https:// sat gasc.telangana.gov.in పైన ఉన్న లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

యూసుఫ్‌గూడ స్టేడియంలో..

జూబ్లీహిల్స్ : యూసుఫ్ గూడ కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియం లో మే 1 నుంచి జూన్ 6 వరకు వేసవి శిక్షణశిబిరం నిర్వహించనున్నట్లు స్టేడియం అడ్మినిస్ట్రేటర్ అలెగ్జాండర్ ఫ్రాన్సిస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు లను ఆన్‌లైన్ వెబ్ సైట్ https://sat gase.tel angana.gov.in నుంచి పొంద వచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖ